www.prajasakti.com
ప్రజాశక్తి
శుక్రవారం 2 జూన్ 2023
5
అన్నమయ్య

స్వస్థలానికి చేరిన పఠాన్ మృతదేహం

పఠాన్ (ఫైల్ ఫోటో)

కడప: కువైట్‌లో గుండెపోటుతో మృతి చెందిన పఠాన్ మౌలాఖాన్ మృతదేహాన్ని ఎపిఎన్‌ఆర్‌టిఎస్, మృతుడి స్నేహితుల సహకారంతో స్వస్థల రాయచోటికి గురువారం చేరింది. జీవనోపాధి కోసం పఠాన్ పదేళ్ళ క్రితం కువైట్‌కు వెళ్లారు. ఆయన కుటుంబం కూడా కువైట్‌లోనే ఉంది. మూడు నెలల క్రితం ఆయన భార్య కూతురు రాయచోటికి వచ్చింది. భర్తకు ఏప్రిల్ 14వ తేదీన గుండెపోటు రావడంతో ఆమె మే 25వ తేదీన కువైట్‌కు వెళ్లారు. 28వ తేదీన పఠాన్ గుండెపోటుతో మృతి చెందారు. వైసిపి వెల్ఫేర్ ఇన్‌చార్జి గోవింద రాజు సహకారంతో మృతుని స్నేహితులు మృతదేహాన్ని రాయచోటికి తీసుకువచ్చేందుకు 20 రోజులు పట్టింది. ఈ సందర్భంగా ఎపిఎన్‌ఆర్‌టిఎస్ డైరెక్టర్ బి.హెచ్.ఇలియాస్, వైసిపి కువైట్ కన్వీనర్ ముమ్మడి బాలిరెడ్డి, కువైట్ ఎపిఎన్‌ఆర్‌టిఎస్ రీజనల్ కో-ఆర్డినేటర్ నాయని మహేష్ మాట్లాడుతూ పఠాన్ స్నేహితులు సూరనరాజు సుధాకర్ రాజు, వెల్లిగండ్ల శ్రీనివాసరాజు, కొండూరు సుబ్రహ్మణ్యం రాజు, సంగరాజు సుదర్శన్ రాజు, మచ్చ రమేష్, స్నేహ ధర్మానికి బాసటగా నిలిచి మానవత్వం చాటుకున్నారన్నారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- కలెక్టర్ గిరీష, ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి

రైతులకు మెగా చెక్‌ను అందజేస్తున్న కలెక్టర్ గిరీష, ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి

ప్రజాశక్తి-రాయచోటి

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని దేశంలో ఎక్కడా లేనివిధంగా రైతులకు వేలకోట్ల రూపాయలు ప్రభుత్వం ఖర్చు చేస్తోందని కలెక్టర్ గిరీష, శాసనసభ వ్యవహారాల సమన్వయకర్త గడికోట శ్రీకాంత్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం రాయచోటి పట్టణం సుండుపల్లె రోడ్డులోని ఓ కల్యాణ మండపంలో వరుసగా ఐదో ఏడాది 2023-24 సంవత్సరం మొదటి విడతగా వైయస్సార్ రైతు భరోసా పిఎం కిసాన్ సాయం కింద ఒక్కొక్కరికి రూ.7500 వేలు చొప్పున కర్నూలు జిల్లా పత్తికొండ నుండి బటన్ నొక్కి వర్చువల్ విధానంలో నిధులు విడుదల చేసిన ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్, శాసనసభ వహారాల సమన్వయకర్త, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్, సభ్యులు, జిల్లాలోని రైతులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వరుసగా ఐదో సంవత్సరం మొదటి విడతగా పెట్టుబడి సాయాన్ని రాష్ట్ర ప్రభుత్వం అందిస్తోందని ఇప్పటివరకు రైతు భరోసా కింద జిల్లాలో దాదాపు రూ.1000 కోట్ల మేర రైతులకు లబ్ధి చేకూరిందన్నారు. రైతు బాగుంటే దేశం బాగుంటుందని ముఖ్యమంత్రి తరచూ చెప్తారని రైతులను ఏ విధంగా ఆదుకుంటున్నారన్న విషయాన్ని రైతులందరూ కూడా ఆలోచించాలన్నారు. నాలుగు సంవత్సరాల్లో దేశంలో ఎక్కడా లేని విధంగా మన రాష్ట్రంలో వ్యవసాయాన్ని ప్రభుత్వం ప్రక్షాళన చేసిందన్నారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు ఇంటి ముంగిటనే వివిధ రకాల సేవలు అందుతున్నాయని, వ్యవసాయ, ఉద్యానవన అధికారులు రైతుల ఇంటి వద్దకే వచ్చి సలహాలు అందజేయడం జరుగుతోందన్నారు. రాష్ట్ర శాసనసభ వ్యవహారాల సమన్వయకర్త గడికోట శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ రైతుల శ్రేయస్సు కోసం ముఖ్యమంత్రి అహర్నిశలు కృషి చేస్తున్నారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా పంట సాగుకు ముందే పెట్టుబడి సాయం అందజేస్తున్న ఏకైక ముఖ్యమంత్రి జగన్. సంవత్సరానికి రూ.7 వేలు చొప్పున నాలుగేళ్లలో రూ.28 వేల కోట్లు రైతులకు అందించారు. రైతులు వ్యవసాయంపై మక్కువ, శ్రద్ధ పెట్టాలని పేర్కొన్నారు. సమావేశంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ పంజం సుకుమార్‌రెడ్డి మాట్లాడుతూ. దివంగత నేత వైయస్సార్ రైతులను ఆదుకున్న విధంగానే ప్రస్తుత ముఖ్యమంత్రి రైతు సంక్షేమానికి పాటుపడుతున్నారు. ఆర్‌బికేల ద్వారా రైతు సేవా కార్యక్రమాలను విస్తృతంగా అమలు చేస్తున్న ఏకైక రాష్ట్రం ఆంధ్రప్రదేశ్. పంట వేయడానికి నెల ముందుగానే భరోసా లబ్ధిని రైతులకు ప్రభుత్వం అందిస్తోందిన్నారు. సమావేశంలో ప్రభుత్వ పథకాల లబ్ధిని అందుకున్న రైతులు తమ అనుభవాలను వివరించారు. అనంతరం వరుసగా ఐదవ ఏడాది 2023-24 సంవత్సరంలో మొదటి విడతగా అన్నమయ్య జిల్లాలోని 202094 మంది రైతులకు రూ.151.96 కోట్ల వైయస్సార్ రైతు భరోసా పిఎం కిసాన్ ఆర్థిక లబ్ధి, మార్చి, ఏప్రిల్ మరియు మే మాసాలలో కురిసిన అకాల వర్షాల వలన జిల్లాలో పంట నష్టపోయిన 1344 మంది రైతులకు రూ.1.79 కోట్ల ఆర్థిక సహాయం మెగా చెక్కులను ముఖ్య అతిథుల చేతుల మీదుగా రైతులకు అందజేశారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఫర్మన్ అహ్మద్ ఖాన్, జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యులు, వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి 'పది' సప్లిమెంటరీ పరీక్షలు

పరీక్షలకు 14,723 మంది విద్యార్థులు
నిమిషం ఆలస్యమైనా అనుమతి లేదు

పరీక్ష రాస్తున్న విద్యార్థులు (ఫైల్‌ఫొటో)

ప్రజాశక్తి-రాయచోటి

అన్నమయ్య జిల్లాలో శుక్రవారం నుంచి 10వ తేదీ వరకు జరిగే సప్లిమెంటరీ పదవ తరగతి పరీక్షలకు జిల్లా అధికారులు సర్వం సిద్ధం చేశారు. జిల్లాలోని రాయచోటి, రాజంపేట, రైల్వేకోడూరు, పీలేరు, మదనపల్లె, తంబళ్లపల్లె నియోజకవర్గలో పది పరీక్షలకు జిల్లా అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. జిల్లా వ్యాప్తంగా 36 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. 14,723 మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నారు. పరీక్ష ఉదయం ఉదయం 9:30 గంటల నుండి 12:45 వరకు పరీక్షలు నిర్వహించనున్నారు. విద్యార్థులు 30 నిమిషాల ముందే పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని, ఒక్క నిమిషం ఆలస్యమైన విద్యార్థులను అనుమతించమని అధికారులు చెబుతున్నారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంది. పరీక్ష సెంటర్ల వద్ద జిరాక్స్ షాపులు కూడా మూసివేస్తున్నారు. పరీక్ష కేంద్రాలలో సిసి కెమెరాలు ఏర్పాటు చేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా ఫ్లేయింగ్ సబ్ స్క్వాడ్, సిట్టింగ్స్ హెచ్‌పిసిస్క్, ఇన్విజిలేటర్లును ఏర్పాటు చేశారు.

పకడ్బందీగా పరీక్షలు

శుక్రవారం నుంచి జరిగే పదవ తరగతి సప్లిమెంటరీ పరీక్షలను పకడ్బందీగా నిర్వహిస్తాం. పరీక్షలు పకడ్బందీగా నిర్వహించేందుకు అన్ని చర్యలు తీసుకోమన్నారు. ఎక్కడ కూడా మాస్ కాపీ జరగకుండా సిసి కెమెరా నిఘాలో పరీక్షలు నిర్వహిస్తామన్నారు. సెంటర్ల వద్ద విద్యార్థుల కోసం ఎఎన్‌ఎంలను నియమించాం. విద్యార్థులు కోసం సెంటర్ల వద్ద మౌలిక వసతులు ఏర్పాట్లు పూర్తి చేశాం. పది పరీక్షలు పగడ్బందీగా నిర్వహించేందుకు అన్ని చర్యలు తీసుకున్నాం. సెంటర్ల వద్ద ఒకటి 144 సెక్షన్ అమలులో ఉంటుంది. ఎవరైనా అవాంఛనీయ సంగతులకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటాం.

- పురుషోత్తం, డిఇఒ, అన్నమయ్య జిల్లా.

గృహ నిర్మాణాలు వేగవంతం చేయాలి : గిరీష

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ గిరీష

ప్రజాశక్తి-రాయచోటి

రీ సర్వే ప్రక్రియలో భాగంగా సర్వే రాళ్ళు పాతడం, గృహ నిర్మాణాల లక్ష్యాలను వేగంగా పూర్తి చేయాలని కలెక్టర్ గిరీష సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం వివిధ ప్రభుత్వ పథకాల అమలుపై అన్ని జిల్లాల కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లతో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ జవహర్‌రెడ్డి విసి ద్వారా సమీక్ష నిర్వహించారు. కలెక్టరేట్ మినీ విసి హాలు నుంచి కలెక్టర్, జెసి ఫర్మాన్‌అహ్మద్‌ఖాన్ పాల్గొన్నారు. విసి ద్వారా జవహర్‌రెడ్డి మాట్లాడుతూ జిల్లాలో రీసర్వే ప్రక్రియ, జాతీయ రహదారుల భూసేకరణ, గృహ నిర్మాణాల స్టేజి కన్వర్షన్స్‌లో నిర్దేశించిన లక్ష్యాలను వేగవంతం చేయాలన్నారు. స్పందన గ్రీవెన్స్‌లను నాణ్యతతో పరిష్కరించాలన్నారు. పర్యాటక అభివృద్ధిలో భాగంగా చేపట్టిన ప్రాజెక్టులకు సంబంధించి పర్యాటక శాఖకు భూమి కేటాయింపులు త్వరితగతిన చేయాలన్నారు. వ్యవసాయ మరియు అనుబంధ శాఖలు ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని ఆదేశించారు. జగనన్నకు చెబుదాం కార్యక్రమం అర్జీలను సకాలంలో నాణ్యతగా అర్జీదారుల సంతృప్తి మేరకు పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలన్నారు. విసి అనంతరం కలెక్టర్ అధికారులతో మాట్లాడుతూ జగనన్నకు చెబుదాం కార్యక్రమంపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. పేదలందరికీ ఇళ్లు కార్యక్రమంలో నిర్దేశించిన లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయాలి. వివిధ దశల్లో ఉన్న గృహాలలో వారం వారం పురోగతి సాధించి త్వరగా పూర్తి చేసే దిశగా కృషి చేయాలన్నారు. జిల్లాలో అమలు చేస్తున్న జగనన్న భూహక్కు - భూ రక్షలో మొదటి దశ రీ సర్వే ప్రక్రియ పూర్తయిన గ్రామాల్లో లక్ష్యం మేరకు హద్దురాళ్ళు పాతడం పూర్తి చేయాలని, రెండవ దశ చేపట్టిన గ్రామాల్లో గ్రౌండ్ ట్రూతింగ్, గ్రౌండ్ వ్యాలిడేషన్, వెక్టరైజేషన్ డిఎల్ ఆర్ పబ్లిష్ చేయడం తదితరాలు సకాలంలో పూర్తి అయ్యేలా ప్రణాళికా బద్ధంగా పనిచేయాలన్నారు. అనంతరం పలు అంశాలలో తీసుకోవాల్సిన చర్యలపై అధికారులకు కలెక్టర్ పలు సూచనలు జారీ చేశారు. సమీక్షలో డిఆర్ఒ సత్యనారాయణ, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

యువగళంతో వైసిపిలో వణుకు

- బహిరంగ సభలో నారా లోకేష్

ప్రజాశక్తి-ప్రొద్దుటూరు పుట్టపర్తిసర్కిల్

యువగళం దెబ్బకి వైసిపి ఎమ్మెల్యేలు వణికిపోతున్నారన్నారని టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ అన్నారు. యువగళం పేరుతో లోకేష్ చేపట్టిన పాదయాత్ర 113వ రోజుకు చేరుకుంది. గురువారం ప్రొద్దుటూరు నియోజకవర్గంలోని చౌటపల్లి విడిది కేంద్రం నుంచి దొరసానిపల్లె, ఆర్ట్స్ కాలేజీ, వన్‌టౌన్ సర్కిల్, ఆర్‌టిసి బస్టాండ్, కొత్తపల్లి ఖాదర్‌బాద్, కొత్తపల్లి విడిది కేంద్రం వరకూ పాదయాత్ర సాగింది. ఆయా ప్రాంతాల్లో బుడగజంగాలు, యువత, చేనేతలు, స్థానికులు, క్రిష్టియన్లు, ఆర్యవైశ్యులు, ముస్లింములతో ముఖాముఖి, మాటామంతి, సమావేశాలు వంటి కార్యక్రమాలు నిర్వహించారు. ప్రొద్దుటూరులో హూ కిల్డ్ బాబాయ్ ప్లకార్డులు ప్రజలకి చూపించి బాబాయ్‌ని లేపేసింది ఎవరు అంటూ లోకేష్ ప్రజలను అడిగారు. వివేకాని మర్డర్ చేసింది అవినాష్, జగన్ అంటూ పెద్ద ఎత్తున ప్రజలు నినదించారు. ప్లకార్డులు ప్రదర్శించకూడదంటూ టిడిపి కార్యకర్తలను డిఎస్‌పి నాగరాజు వారించారు. అన్ని అనుమతులు తీసుకొని పాదయాత్ర చేస్తున్నామని, మమ్మల్ని రెచ్చగొట్టేలా వైసిపి వాళ్ళు ఫ్లెక్సీలు పెట్టినప్పుడు మీరు ఎక్కడ ఉన్నారంటూ డిఎస్‌పిని లోకేష్ ప్రశ్నించారు. అక్కడి నుండి పోలీసులు వెనుదిరిగిపోయారు. పాదయాత్ర సందర్భంగా శివాలయం సర్కిల్‌లో నిర్వహించిన బహిరంగ సభలో లోకేష్ మాట్లాడుతూ టిడిపి మ్యానిఫెస్టో దెబ్బకి వైసిపి నాయకుల మైండ్ బ్లాంక్ అయిందన్నారు. 2019 ఎన్నికల్లో ప్రొద్దుటూరుని అభివృద్ధిలో పరుగులు పెట్టిస్తాడని రాచమల్లు శివప్రసాద్‌రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించారని తెలిపారు. ఆయన ప్రొద్దుటూరుని గ్యాంబ్లింగ్, క్రికెట్ బెట్టింగ్, మట్కా, గుట్కా, దొంగనోట్లు, ఇసుక అక్రమ రవాణాకి అడ్డాగా మార్చారని విమర్శించారు. ఏకంగా సొంత ఇంటినే అసాంఘిక కార్యక్రమాలకు కేర్ ఆఫ్ అడ్రెస్‌గా మార్చుకున్నారని తెలిపారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు సొంత కారుకు ఇఎంఐ, అద్దె ఇంట్లో ఉన్న స్థితి నుండి ఇప్పుడు వేల కోట్ల అధిపతి అయ్యారనిమ పేర్కొన్నారు. ప్రొద్దుటూరుకు ప్రజలు గెలిపించిన ఎమ్మెల్యే ఒకరైతే నామినేటెడ్ ఎమ్మెల్యేలు మరో ఇద్దరని తెలిపారు. ఆర్‌బికె రాచమల్లు, బంగారు రెడ్డి, కిరణ్ రెడ్డి ఈ ముగ్గురు ప్రొద్దుటూరుని కేకులా కోసుకొని తినేస్తున్నారని విమర్శించారు. ఏడాదికి రూ.500 కోట్లు ఐదేళ్లలో రూ.2500 కోట్లతో ప్రొద్దుటూరు రూపురేఖలు మార్చేస్తానన్నారన్నారు. ఆయన రూపురేఖలు మారాయి అవినీతి సొమ్ముతో లావు అయ్యాడే తప్ప ప్రొద్దుటూరు రూపురేఖలు మారలేదన్నారు. పట్టుమని రూ.100 కోట్ల పనులు కూడా పూర్తి చేయలేని అసమర్థ ఎమ్మెల్యే అని పేర్కొన్నారు. టిడిపి హయాంలో నిర్మించిన టిడ్కో ఇళ్లు తీసుకోవద్దు వైసిపి ప్రభుత్వం వచ్చిన వెంటనే 2 సెంట్లలో ఒక్క రూపాయి తీసుకోకుండా ఇళ్లు నిర్మించి ఇస్తామన్నారని తెలిపారు. బొందిలి కార్పొరేషన్ డైరెక్టర్ రజిని దొంగ నోట్లు చలామణి చేస్తూ కర్ణాటకలో పట్టుబడ్డారని, దీని వెనుక ఉన్న దొంగనోట్ల డాన్ బెట్టింగ్ ప్రసాద్ అని పేర్కొన్నారు. ప్రొద్దుటూరులో ఏ వ్యాపారం చేసినా ఆయనకు కప్పం కట్టాల్సిందేనన్నారు. ఈయన దెబ్బకి వ్యాపారస్తులు అందరూ వణికిపోతున్నారని తెలిపారు. అధికారంలోకి వచ్చాక 2.30 లక్షల ఉద్యోగాలు భర్తీచేస్తానని చెప్పి, జాబ్‌లెస్ కేలండర్ విడుదల చేశారన్నారు. తీవ్ర నిరాశ, నిస్పృహలకు గురైన 470 మంది యువతీ యువకులు ఆత్మహత్యలు చేసుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నిరుద్యోగ యువతను ఆదుకునేందుకు తమ పార్టీ అధినేత చంద్రబాబునాయుడు రూ.3 వేల నిరుద్యోగ భృతి ప్రకటించారన్నారు. స్థానిక సంస్థల నిధులను పక్కదారి పట్టించడంతో మున్సిపాలిటీల్లో కనీసం బ్లీచింగ్ పౌడర్ చల్లేందుకు కూడా నిధుల్లేని పరిస్థితులు నెలకొన్నాయన్నారు. స్వచ్ఛందంగా పనిచేసే ఆర్యవైశ్య సభలను సైతం జగన్ ప్రభుత్వం జోక్యం చేసుకొని ఇబ్బందులకు గురిచేయడం దారుణమన్నారు. జగన్ ప్రభుత్వంలో రాష్ట్రంలో ఏ సామాజికవర్గం ప్రశాంతంగా జీవించే పరిస్థితులు లేవని తెలిపారు. వివిధ చేతివృత్తుల వారి ఉపాధిని దెబ్బతీశారని తెలిపారు. ముస్లిం మైనారిటీల ఆస్తులపై ఉన్న శ్రద్ధ వారి సంక్షేమంపై లేదన్నారు. మైనారిటీలకు చెందిన వేల కోట్ల రూపాయల వక్ఫ్ మసీదుల ఆస్తులను వైసిపి నేతలు దోచుకున్నారని విమర్శించారు. విధ్వంక పాలకుడు జగన్ బాటలోనే స్థానిక ఎమ్మెల్యే రాచమల్లు నడుస్తున్నారన్నారు. తన స్వార్థం కోసం వందలాది మందికి ఉపాధి కల్పించే మార్కెట్‌ను కూలదోయడం దారుణమని తెలిపారు. ఇస్లామిక్ బ్యాంక్ ఏర్పాటు చేసి పేద ముస్లింలకు ఆర్థికంగా చేయూతనిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు శ్రీనివాసులురెడ్డి, జిల్లా అధ్యక్షులు మల్లెల లింగారెడ్డి, ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి, టిటిడి మాజీ చైర్మన్ పుట్టా సుధాకర్ యాదవ్, మాజీ ఎమ్మెల్సీ బిటెక్ రవి, నియోజకవర్గ ఇన్‌చార్జి ప్రవీణ్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు

ప్రొద్దుటూరు బహిరంగ సభలో మాట్లాడుతున్న నారా లోకేష్

సమస్యలు పరిష్కరించే వరకూ పోరాటం

- ఎపి ప్రభుత్వఉద్యోగుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు లక్ష్మీపతి

మాట్లాడుతున్న ఎపి ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు లక్ష్మీపతి

ప్రజాశక్తి-పీలేరు

ఉద్యోగులు తమ న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని ఎన్నిసార్లు ప్రభుత్వానికి విన్నవించినా చీమ కుట్టినట్లయినా లేదని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు లక్ష్మీపతి ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యోగుల సమస్యల సాధనకై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కెఆర్.సూర్యనారాయణ, గొంతి ఆస్కారావు పిలుపు మేరకు రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు చేపట్టామన్నారు. పీలేరు తాలూకాలో తాలూకా అధ్యక్షుడు పురుషోత్తం అధ్యక్షతన గురువారం తహశీల్దార్ కార్యాలయం ఎదుట రిలే నిరాహార దీక్ష ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి జిల్లా అధ్యక్షులు శ్రీనివాసులరెడ్డి హాజరై ఉద్యోగుల్లో మరింత ఉత్తేజపరిచేలా సమస్యల సాధనకై యూనియన్ చేపట్టిన కార్యక్రమాల గూర్చి వివరించారు. చిత్తూరు జిల్లా అధ్యక్షులు శివయ్య మాట్లాడుతూ ఉద్యోగుల జీతాలకు చట్టబద్ధత చేయాలని, కాంట్రాక్టు ఉద్యోగులను సత్వరం రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. అలాగే పిహెచ్‌ఎంఈయు చిత్తూరు జిల్లా అధ్యక్షులు ఏ.లక్ష్మీనారాయణ మాట్లాడుతూ పాత పెన్షన్ విధానాన్ని అమలులోకి తీసుకురావాలని ప్రభుత్వానికి సూచించారు. యుటిఎఫ్ నాయకులు రాధాకృష? మాట్లాడుతూ జి. రాధాకృష్ణ మాట్లాడుతూ 11వ పిఆర్సీ బకాయిలు ఇంతవరకు చెల్లించలేదని ఇది దారుణమని అన్నారు. సిపిఎస్ సుధాకర్ మాట్లాడుతూ సిపిఎస్ ను రద్దు చేసి ఓపిస్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఏపిజిఈఏ జిల్లా కార్యదర్శి గురు ప్రసాద్ మాట్లాడుతూ ప్రశాంతంగా ఉద్యోగాలు చేసుకోవాల్సిన ఉద్యోగస్తులను నేడు రోడ్లపైకి తీసుకురావడం ఈ ప్రభుత్వానికే చెల్లిందన్నారు. పెన్షనర్ల సంఘం పీలేరు తాలూకా అధ్యక్షులు వగళ్ళ చంద్రారెడ్డి మాట్లాడుతూ ఉద్యోగస్తులకు అందాల్సిన బెనిఫిట్స్ సకాలంలో అందిస్తే ఇలాంటి పరిస్థితి వచ్చేది కాదని, ఈ విషయాన్ని ప్రభుత్వం గుర్తించాలని ఆయన సూచించారు. జిల్లా మహిళా విభాగ కార్యదర్శి కుసుమ కుమారి మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు జరుగుతుంటే ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. కార్యక్రమంలో క్రాంట్రక్ట్ అసోసియేషన్ విశ్వనాథరెడ్డి, చిత్తూరు తాలుకా శ్రీనివాస మూర్తి, సిరాజుద్దీన్, పీలేరు తాలుకా కార్యదర్శి రెడ్డిశేఖర్, ట్రెజరర్ జయరామయ్య, సభ్యులు విద్యాసాగర్, కృష్ణయ్య, మోహన్, స్వర్ణలత, హసన్ బాషలతోపాటు కాంట్రాక్టు ఉద్యోగులు, ఆరోగ్య శాఖ ఉద్యోగులు, అన్ని శాఖల ఉద్యోగులు ఈ ఆందోళన కార్యక్రమంలో పాల్గొన్నారు.

క్రమశిక్షణతో పనిచేస్తే దేశంలోనే మొదటి స్థానం : విసి

ప్రజాశక్తి - కడప అర్బన్

విశ్వవిద్యాలయ కుటుంబ సభ్యులంతా నిజాయితీ, నిబద్ధత, క్రమశిక్షణతో పనిచేస్తే వైవీయూను దేశంలోనే మొదటి స్థానానికి తీసుకెళతానని ఉపకులపతి ఆచార్య చింతా సుధాకర్ పేర్కొన్నారు. విశ్వవిద్యాలయంలో పనిచేసే బోధనేతర సిబ్బందితో గురువారం ఆయన స్థానిక సురభి సెమినార్ హాల్‌లో వైవియు కులసచివులు ఆచార్య వైపి వెంకటసుబ్బయ్యతో కలిసి భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశ్వవిద్యాలయంలో బోధనేతర సిబ్బందిలో 80 శాతం మంది డిగ్రీ, పిజి, ఇంజనీరింగ్ వంటి అర్హతగలవారు ఉండడం శుభ పరిణామమని తెలిపారు. బోధనేతర సిబ్బంది లేకుండా ప్రగతిని ఊహించలేమన్నారు. విశ్వవిద్యాలయ విధానాల రూపకల్పనలో వారి పాత్ర అత్యంత కీలకమని, అంతే బాధ్యతతో విధులు నిర్వర్తించాలన్నారు. నిర్లక్ష్యం, నిర్లిప్తతను ఉపేక్షించేది లేదన్నారు. సమయపాలనలో తాను ఖచ్చితంగా ఉంటానని స్పష్టం చేశారు. నాలుగు దశాబ్దాలపాటు శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలో వివిధ పరిపాలన బాధ్యతలు చూశానని, ప్రతి అంశంపై తనకు అవగాహన ఉందన్నారు.

గ్రూప్-1 పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు : డిఆర్ఒ

కడప: ఎపిపిఎస్‌సి ఆధ్వర్యంలో శనివారం నుండి 10వ తేదీ వరకు జరగనున్న గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని డిఆర్ఒ గంగాధర్ గౌడ్ ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో గురువారం ఆయన పరీక్షల నిర్వహణపై సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలను ముందస్తు ప్రణాళికతో కట్టుదిట్టమైన ఏర్పాట్లతో పకడ్బందీగా నిర్వహించాలన్నారు. అభ్యర్థులను ఉదయం 8.30 గంటల నుండి 9.45 గంటల వరకు మాత్రమే పరీక్ష కేంద్రానికి అనుమతించాలన్నారు. అభ్యర్థులు తమ హాల్‌టికెట్‌తో పాటు ఒరిజినల్ పాస్‌పోర్ట్, పాన్‌కార్డ్, ఓటర్ గుర్తింపు కార్డు, ఆధార్ కార్డు, డ్రైవింగ్ లైసెన్స్ ఏదైనా ఒకటి తీసుకెళ్లాలన్నారు. అన్నమాచార్య ఇంజనీరింగ్ కళాశా లలో (సికెదిన్నె) నిర్వహించే ఈ పరీక్షలకు 414 మంది అభ్యర్థులు హాజం ౕవుతారని తెలిపారు. అభ్యర్థులతో బయోమెట్రిక్ విధానంలో హాజరు తీసుకొని పరీక్ష హాల్‌కు అనుమతిస్తారన్నారు. సెల్‌ఫోన్, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలకు అనుమతిలేదన్నారు. పరీక్ష కేంద్రాల్లో విద్యుత్ అంతరాయం లేకుండా చూ డాలని ఆ శాఖ అధికారులను ఆదేశించారు. టాయిలెట్స్, తాగునీరు ఉండేలా చూసుకోవాలన్నారు. విభిన్న ప్రతిభావంతులకు, గర్భిణులకు గ్రౌండ్ ఫ్లోర్‌లో పరీక్ష నిర్వహించేలా చూడాలని సూచించారు. పరీక్ష కేంద్రాల పరిసర ప్రాంతాల్లో 144 సెక్షన్ విధించి కట్టుబడ్డ భద్రత ఏర్పాటు చేయాలని పోలీసుశాఖను ఆదేశించారు. పరీక్ష కేంద్రం సమీపంలో జిరాక్స్ కేంద్రాలు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా లైజన్ అధికారి ఎఫ్ఎస్ఒ మల్లిఖార్జునరెడ్డి, ఎపిపిఎస్‌సి సెక్షన్ అధికారులు జి.అశోక్, కె.సురేష్ పాల్గొన్నారు.

విద్యార్థుల సమగ్ర ప్రగతికి కృషి

- వైవీయూ ప్రిన్సిపల్ ఆచార్య రఘునాథరెడ్డి



ప్రిన్సిపల్ రఘునాథరెడ్డి

ప్రజాశక్తి-కడప అర్బన్

విశ్వవిద్యాలయ విద్యార్థుల సమగ్ర ప్రగతికి కృషి చేస్తానని యోగి వేమన విశ్వవిద్యాలయం ప్రధానాచార్యులు ఆచార్య సామాను రఘునాథరెడ్డి అన్నారు. వైవీయూ పోస్ట్ గ్రాడ్యుయేషన్ కళాశాల ప్రధానాచార్యులుగా ఆచార్య రఘునాథరెడ్డి గురువారం బాధ్యతలను స్వీకరించారు. ఆయనను వైస్ చాన్సిలర్ ప్రొఫెసర్ చింత సుధాకర్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వైపి వెంకటసుబ్బయ్య, పూర్వపు ప్రధానాచార్యులు కె.కృష్ణారెడ్డి, పాలకమండలి సభ్యురాలు ఆచార్య పద్మ, పరీక్షల నియంత్రణ అధికారి ఆచార్య ఎన్.ఈశ్వర్ రెడ్డి, ఐటీ సెల్ డైరెక్టర్ ఆచార్య ఎంవి శంకర్ పుష్పగుచ్ఛం అందజేసే అభినందనలు తెలిపారు. వివిధ విభాగాల అధిపతులు, విశ్వవిద్యాలయ ఆచార్యులు, సహ ఆచార్యులు, సహాయ ఆచార్యులు, అకడమిక్ కన్సల్టెంట్లు, బోధ నేతల సిబ్బంది పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా రఘునాథరెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల్లో నైపుణ్యాన్ని పెంచేందుకు, విశ్వవిద్యాలయంలో ఉన్న వనరులు విద్యార్థులు సద్వినియోగం చేసుకునేలా చూస్తానన్నారు. వసతి గృహాల పరంగా విసి, రిజిస్ట్రార్ల సహకారంతో అన్ని రకాల సౌకర్యాలు ఉండేలా చూస్తామన్నారు. సాంకేతిక విధానాన్ని వినియోగించుకుని ఈ-పరిపాలనను సాగిస్తామన్నారు. విద్యార్థుల ఉద్యోగ అవకాశాల కోసం పరిశ్రమలతో అనుసంధానం అవుతామని తెలిపారు. అలానే పలు సంస్థల్లో ప్రాజెక్టుల నిర్వహణకు విద్యార్థులను తయారు చేస్తామన్నారు. ప్రఖ్యాత వ్యక్తుల ఉపన్యాసాలు, నైపుణ్యాలు, ఇన్నవేటివ్ థింకింగ్ విద్యార్థులకు అందేలా సెమినార్లు, వర్క్షాపులు నిర్వహిస్తామన్నారు. జాతీయ విద్యా విధానం 20-20 అమలు చేయడం, అధ్యాపకుల సహకారంతో విద్యార్థుల బహుళ ప్రయోజనాల కోసం కోసం కృషి చేస్తానని స్పష్టం చేశారు.

పేదల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట : 'చింతల'

ప్రజాశక్తి-కంభంవారిపల్లె(పీలేరు)

పేద ప్రజల సంక్షేమానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి పెద్దపీట వేశారని పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి తెలిపారు. గురువారం కెవి పల్లె మండలం, వగళ్ల పంచాయతీ పరిధిలోని పలు గ్రామాల్లో జరిగిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొని, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు తీరు గురించి ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను 98 శాతం అమలు చేసిన ఘనత సిఎం జగన్మోహన్ రెడ్డికే దక్కుతుందని, నవరత్నాల అమలులో భాగంగా పేదలు, రైతులు, మహిళలు, విద్యార్థుల సంక్షేమం కోసం వైసిపి ప్రభుత్వం అనేక పథకాలను అమలు చేస్తూందన్నారు. పార్టీలకతీతంగా అమలు చేస్తున్న పథకాలతో పేదలందరికీ లబ్ధి చేకూరుతోందని, సచివాలయ, వాలంటరీ వ్యవస్థలతో పరిపాలనను క్షేత్రస్థాయికి తీసుకురావడంతో గ్రామీణులకు ఎంతో వెసులుబాటు కలిగిందన్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులు విన్నవించిన సమస్యల పరిష్కారానికి అక్కడికక్కడే అధికారులకు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి ఈశ్వరమ్మ, జడ్పిటిసి గజ్జల శృతి, రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ కారపాకుల భాస్కర్ నాయుడు, రాష్ట్ర ఉర్దూ అకాడమీ డైరెక్టర్ అబ్దుల్ కలీమ్, వైసిపి నాయకులు వెంకటరమణారెడ్డి, గజ్జెల శీను రెడ్డి, కలకడ ఎంపిపి శ్రీదేవి, సర్పంచ్ కొండారెడ్డి, పీలేరు సర్పంచ్ డాక్టర్ షేక్ హబీబ్ బాష, ఎంపిడిఓ లతీఫ్ ఖాన్, తహశీల్దారు నరసింహులు, ఏడిఈ సుధాకర్, ఎంఈఓ రెడ్డి బాష, స్థానిక నాయకులు పెద్దిరెడ్డి ద్వారకనాథ్ రెడ్డి, రఘునాథ రెడ్డి , మల్లికార్జున రెడ్డి , రాంప్రసాద్ నాయుడు, గణపతి రెడ్డి, వివిధ శాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

ప్రజలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రామచంద్రారెడ్డి



పురస్కారం అందజేస్తున్న మేడా, ఆకేపాటి

ప్రోత్సహించేందుకే పురస్కారాలు

- జడ్పీ చైర్మన్ 'ఆకేపాటి', ఎమ్మెల్యే 'మేడా'

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

వాలంటీర్లు ప్రభుత్వానికి, ప్రజలకు వారధులని, వారిలో సేవా గుణాన్ని మరింత పెంపొందించేందుకు, వారిని ప్రోత్సహించేందుకే పురస్కారాలు అందజేయడం జరుగుతోందని ఎమ్మెల్యే మేడా వెంకట మల్లిఖార్జునరెడ్డి, జిల్లా పరిషత్ చైర్మన్ ఆకేపాటి అమర్నాథ్‌రెడ్డి తెలిపారు. గురువారం మున్సిపల్ కార్యాలయంలో వార్డు వాలంటీర్లకు, మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయంలో గ్రామ వాలంటీర్లకు వాలంటీర్లకు వందనం అనే కార్యక్రమం ద్వారా సత్కారం చేశారు. వాలంటీర్లకు వారు చేసిన సేవలకు గాను సేవారత్న, సేవా మిత్ర అనే పురస్కారాలతో సత్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పాల్గొన్న ఆకేపాటి, మేడా మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి ఆశయాలను, ప్రభుత్వ లక్ష్యాలను ప్రజల ముంగిటకు చేర్చడంలో వాలంటీర్లదే కీలక పాత్ర అని పేర్కొన్నారు. ప్రతికూల పరిస్థితులలోనూ వాలంటీర్లు బాధ్యతాయుతంగా సేవలందించడం అభినందనీయమని పేర్కొన్నారు. క్షేత్రస్థాయిలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించాలన్నారు. జన్మభూమి కమిటీల పేరుతో ప్రజలను మోసం చేసిన చంద్రబాబు వాలంటరీ వ్యవస్థను కించపరిచారని తెలిపారు. జాతిపిత మహాత్మా గాంధీ కలలుగన్న గ్రామ స్వరాజ్య సాధన దిశగా నెలకొల్పిన సచివాలయ వ్యవస్థలో గ్రామ, వార్డు వాలంటీర్లదే కీలక పాత్ర అని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పోలా శ్రీనివాసులురెడ్డి, కమిషనర్ ఎం.జనార్దన్‌రెడ్డి, కౌన్సిలర్లు, కో-ఆప్షన్ సభ్యులు, ఎంపిడిఒ బాలమునిస్వామి, పంచాయతీ కార్యదర్శులు, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జగనన్న విద్యా కిట్లను పరిశీలిస్తున్న విద్యాశాఖ అధికారులు

విద్యా కానుక కిట్ల నాణ్యత పరిశీలన

ప్రజాశక్తి-కురబలకోట

విద్యార్థులకు అందించే జగనన్న విద్యా కనుక కిట్ల నాణ్యతను రాష్ట్ర పాఠశాల విద్యా పర్యవేక్షణ, నియంత్రణ కమిటీ మెంబర్ బి.ఈశ్వరయ్య, ఎంఇఒ ద్వారాకనాథ్‌లు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు గురువారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కురబలకోటలో జగనన్న విద్యాకానుక కిట్ల స్టాక్ పాయింట్‌ను సందర్శించారు. యూనిఫామ్, బూట్లు సాక్స్ లు , బెల్ట్ , బ్యాగ్, నిఘంటువు , టెక్స్ట్‌బుక్స్ నాణ్యతను పరిశీలించారు. తరగతి వారీగా, సైజు వారీగా విద్యార్థుల వారీగా స్కూల్ వారీగా కిట్లు వివరాలను అడిగి తెలుసుకొన్నారు.అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యపై ప్రత్యేక దృష్టి పెట్టారని అన్నారు. విద్యాకానుక విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో ఎంఆర్‌సి సిబ్బంది నరసింహులు, గణేష్ పాల్గొన్నారు.

నేడు ఉపాధి హామీ సామాజిక తనిఖీ గ్రామసభ

ప్రజాశక్తి-నిమ్మనపల్లి

మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం సామాజిక తనిఖీ ప్రత్యేక గ్రామసభను శుక్రవారం వెంగంవారిపల్లి సచివాలయం వద్ద సర్పంచ్ జి.శ్రీవాణినవీన్ అధ్యక్షతన నిర్వహిస్తున్నట్లు పంచాయతీ కార్యదర్శి వెంకట రమణారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎంజిఎన్ ఆర్ఇజిఎస్ ద్వారా పంచాయతీ పరిధిలో 2022-23 సంవత్సరంలో చేపట్టిన వివిధ పనులను సామాజిక తనిఖీ బృందం ప్రత్యేక గ్రామసభను నిర్వహించి తనిఖీ చేస్తారని తెలిపారు. ఉదయం 10 గంటలకు సచివాలయం వద్ద నిర్వహించే గ్రామ సభకు సంబంధించిన సభ్యులందరూ పాల్గొనాలని తెలిపారు.

విగ్రహ ప్రతిష్టాపనలో 'చమర్తి'

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

మండల పరిధిలోని ఊటుకూరు గ్రామంలో నిర్వహిస్తున్న నాగదేవత విగ్రహ ప్రతిష్ట కార్యక్రమానికి ఊటుకూరు సతీష్‌రాజు ఆహ్వానం మేరకు టిడిపి నాయకులు చమర్తి జగన్మోహన్‌రాజు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలయాలు సంస్కృతి, సంప్రదాయాలకు నిలయాలని అన్నారు. కార్యక్రమంలో సుబ్రహ్మణ్యం రాజు, శ్రీనివాసరాజు, రామకృష్ణం రాజు, శివప్రసాద్ రాజు, పవన్ రాజు, సాయి వర్మ, ప్రసాద్ రాజు, టీ ఎన్ ఎస్ ఎఫ్ పార్లమెంట్ అధ్యక్షులు పోలి శివకుమార్, యువనాయకులు నాగేంద్ర, వెంకటేష్ యాదవ్, కేతా రాజశేఖర్, వినోద్ రెడ్డి పాల్గొన్నారు.

బ్రిజ్ భూషణ్‌ను అరెస్టు చేయాలి

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

మహిళ యోధురాలను లైంగికంగా వేధింపులకు గురిచేసిన బిజెపి ఎంపీ బ్రిజ్ భూషణ్ శరన్‌సింగ్ ను వెంటనే అరెస్టు చేసి, రెజ్లింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా అధ్యక్ష పదవి నుంచి తొలగించాలని రాజంపేట కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి పూల భాస్కర్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మల్ల యోధులు భారత ఒలంపిక్ అసోసియేషన్ కు అనుబంధంగా ఉన్న ఇతర ప్రభుత్వ ఏజెన్సీలకు ఎంపీ పై ఫిర్యాదు చేసినా, న్యాయం కోసం ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద నెలల తరబడి నిరసన చేస్తున్నా కేంద్ర ప్రభుత్వం స్పందించకపోవడం సిగ్గుచేటని అన్నారు. ఢిల్లీ పోలీసులు సుప్రీంకోర్టు ఆదేశాలను పాటించకుండా చట్టాన్ని తుంగలో తొక్కడం ప్రస్ఫుటంగా కనిపిస్తోందని తెలిపారు. ఎంపీని వెంటనే అరెస్టు చేసి పార్లమెంటు సభ్యత్వాన్ని రద్దు చేయాలని, పోష్, పోక్సో చట్టాలను ప్రభావవంతంగా, వేగవంతంగా అమలు చేసి భారత రెజ్లర్లకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

సెలవులకు ఊరెళ్లేవారు అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి-రాజంపేట రూరల్

మాట్లాడుతున్న ఎస్ఐ భక్తవత్సలం

వేసవి సెలవుల్లో ఊర్లకు విహార యాత్రలకు వెళ్లే ప్రజలు తమ విలువైన వస్తువులను బ్యాంకు లాకర్లలో పెట్టుకుని తగు జాగ్రత్తలు తీసుకోవాలని రాజంపేట రూరల్ ఎస్ఐ భక్తవత్సలం తెలిపారు. ఈ సందర్భంగా ఆయనమాట్లాడుతూ ఊర్లకు వెళ్లే వారి ఇళ్లను దొంగలు టార్గెట్ చేస్తున్నారని లాక్ వేసిన ఇళ్లను టార్గెట్ చేసి రాత్రి సమయాల్లో దొంగతనానికి పాల్పడుతున్నారని అన్నారు. దూరప్రాంతాలకు వెళ్లేవారు తప్పని సరిగా పోలీసులకు తెలిపితే ఆ ఇళ్లపై నిఘా ఉంచుతారని ఆయన తెలిపారు. ఊర్లకు వెళ్లేవారు తమ ఇంటి లోపలి భాగంలో తాళం వేసి లైట్ వేయడం వలన ఆ ఇంటిలో మనుషులు ఉన్నారని తద్వారా దొంగతనాలు అరికట్టవచ్చునని ఊర్లకు వెళ్లేవారు తమ పక్కింటి వారికి కూడా తెలపాలన్నారు. రాత్రి సమయంలో తమ ఇళ్ల వద్ద ఎవరైనా అనుమానస్పదంగా కనిపిస్తే వెంటనే 100కు డయల్ చేయాలని దొంగతనాలను అరికట్టేందుకు ప్రకటనల ద్వారా మైక్‌ల ద్వారా, కరపత్రాలు పంచడం లాంటివి నిర్వహిస్తూ ప్రజల్లో చైతన్యం తీసుకొస్తున్నామని ఈ సందర్భంగా ఆయన తెలిపారు.

ప్రమాదకరంగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్

సుండుపల్లి-ప్రజాశక్తి

ప్రమాదకరంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్

మండల కేంద్రంలోని సుండుపల్లి నుంచి రాయచోటి మెయిన్ రోడ్డు పక్కనే ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ప్రమాదకరంగా ఉండ టంతో స్థానిక ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మకు ఎలాంటి కంచెను ఏర్పాటు చేయలేదని, ప్రతినిత్యం పిల్లలు, పెద్దలు తిరుగుతూనే ఉంటారని చెప్పారు. చిన్న పిల్లలు రోడ్డు పక్కనే ఉండడంతో ఎప్పుడు ఎటువంటి ప్రమాదం జరుగుతుందోనని ఆందోళన చెందుతున్నారు. ప్రమాదం జరగముందే సంబంధిత అధికారులు ట్రాన్స్‌ఫార్మర్‌కు కంచె ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

కాంగ్రెస్ మండల అధ్యక్షులుగా మైసూరారెడ్డి

ప్రజాశక్తి-రామపురం

మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులుగా రామాపురం మండలం. రాచపల్లి పంచాయతీ, గంగనేరు క్వాటర్స్‌కు చెందిన మొరంరెడ్డి మైసూరారెడ్డిని గురువారం నియోజకవర్గ ఇన్‌ఛార్జి అల్లా బకాష్ ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాహుల్ గాంధీ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మల్లికార్జునఖర్గే, రాష్ట్ర అధ్యక్షుడు గిడుగురుద్రరాజు ఆధ్వర్యంలో కాంగ్రెస్‌పార్టీని బలోపేతం చేస్తున్నారని అన్నారు. అందులో భాగంగా జిల్లా నాయకులు, మండల నాయకులు ఎంపిక చేసి కాంగ్రెస్‌పార్టీకి రాష్ట్రంలో పూర్వ వైభవం తెచ్చేందుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎపి సిసి డెలిగేట్ ఎస్ఎండిగౌస్, ఖదీర్, అమీర్, చెన్నకృష్ణ, దినకర్ వెంకటేశ్వర్లు, ఖాదర్‌ఖాన్, ఫయాజ్ పాల్గొన్నారు.

మైసూరారెడ్డికి నియామక పత్రాన్ని అందిస్తున్న నియోజకవర్గ ఇన్‌ఛార్జి అల్లాబకాష్

రేషన్ బియ్యం కోసం అష్టకష్టాలు

కనిపించని డిఎంయు వాహనాలు

నెట్‌వర్క్ సమస్యతో డీలర్‌షాపుల వద్ద పడిగాపులు

ప్రజాశక్తి-సుండుపల్లి

ఇంటి వద్దకే రేషన్ కార్యక్రమాన్ని అధికారులు పటిష్టంగా అమలు చేయక పోవడంతో రేషన్ బియ్యం తీసుకునేందుకు ప్రజలు అష్టకష్టాలు పడుతున్నారు. ఇంటింటికి వచ్చి రేషన్ అందించే వాహనాలు నిలిపి వేయడంతో కార్డుదారులు డీలర్‌షాపుల వద్దకే వెళ్లి రేషన్ తీసుకునే పరిస్థితి ఏర్పడింది. నెట్‌వర్క్ సమస్యతో రేషన్ తీసుకునేందుకు కార్డుదారులు చౌక దుకాణాల వద్ద పడిగాపులు గాయల్సి వస్తోంది. ఉదయం నుంచి సాయంత్రం వరకు డీలర్‌షాపుల వద్ద వేచి ఉండాల్సి పరిస్థితి ఏర్పడిందని ఆవేదన చెందుతున్నారు. ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా లక్షలాది రూపాయలు ఖర్చు చేసి ఇంటి వద్దకే రేషన్ పథకాన్ని ప్రవేశపెట్టిన ప్రయోజకరంగా లేదని చెబుతున్నారు. నెట్ వర్క్ పనిచేయక పోవడంతో కూలీ పనులు వెళ్లే వారు ఇబ్బందులకు గురవుతున్నారు. డీలర్లు నెట్‌వర్క్ పనిచేయడం లేదని నెట్‌వర్క్ పనిచేసేంత వరకు వేచి ఉండాలని చెబుతున్నారని అంటున్నారు. రేషన్ సమస్యపై మండల అధికారులు దృష్టికి పదేపదే తీసుకవెళ్లినా ఎటువంటి ప్రయోజనం లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ఇంటింటి రేషన్ వాహనాల ద్వారా సకాలంలో రేషన్ బియ్యాన్ని అందించాలని ప్రజలు కోరుతున్నారు.

రేషన్ బియ్యం కోసం పడిగాపులు కాస్తున్న కార్డుదారులు

ఇంటివద్దకే వచ్చి రేషన్ అందించాలి

సకాంలో రేషన్ బియ్యం అందక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. రేషన్ వాహనాల ద్వారా ఇంటి వద్దకే వచ్చి రేషన్ బియ్యాన్ని అందించాలి. డీలర్ షాపుల వద్ద కార్డుదారులు పడిగాపులుకాయాల్సి వస్తోంది. ఇప్పటికే ఈ విషయాన్ని తహశీల్దార్ దృష్టికి తీసుకెళ్లాం. ఉన్నతాధికారులైన స్పందించి రేషన్ సక్రమంగా అందేలా చర్యలు తీసుకోవాలి.

- కె.వి.రమణయ్య, మాలమహానాడు రాష్ట్ర కార్యదర్శి

దళితుల సమస్యలపై ప్రత్యేక దృష్టి

ప్రజాశక్తి-కలికిరి

మానిటరింగ్ సమావేశంలో దళితుల సమస్యలు వింటున్న తహశీల్దార్

దళితుల సమస్యలపై ప్రత్యేక దృష్టి సాధిస్తామని తహశీల్దార్ భాగ్యలత హామీనిచ్చారు. గురువారం కలికిరి బండ కాడపల్లి గ్రామంలో నిర్వహించిన ఎస్‌సి, ఎస్‌టి మానిటరింగ్ సమావేశంలో దళితులు నుంచి వచ్చిన సమస్యలపై ఆమె స్పందించారు. ఈ సందర్భంగా గ్రామంలో వీధి లైట్లు వెలగలేదని, డ్రైయినేజీ కాలువలు శుభ్రం చేయలేదని, రేషన్ బియ్యం పంపిణీ చేసే ఎండియు ఆపరేటర్లు వీధిలోకి రావడం లేదని పలు సమస్యలు అధికారులకు విన్నవించుకున్నారు. ఈ సందర్భంగా తహ శీల్దార్ మాట్లాడుతూ దళి తులకు ఎలాంటి సమస్యలు ఉన్నా అధికా రులు వెంటనే స్పందించి ఎప్పటికప్పుడు పరిష్కరించే విదంగా చర్యలు తీసుకుంటా మని వారికి తెలిపారు. కార్యక్రమంలో ఎఎస్ఐ మధు సూదనాచారి, యుఒ ఆర్‌డి ఆజాద్, డాక్టర్ చిన్నరెడ్డప్ప, విఆర్ఒ విశ్వనాధ్, ఎస్‌సి, ఎస్‌టి మానిటరింగ్ సభ్యులు యేసు రాజు, శ్రీనివాస్ వర్మ, శంకరగిరి పాల్గొన్నారు.

గడప గడపకూ కరపత్రాల పంపిణీ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు

గడప గడపకూ కరపత్రాల పంపిణీ

ప్రజాశక్తి-పుల్లంపేట

మండల పరిధిలోని కొమ్మనపల్లి ఎస్‌సి కాలనీలో కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి గోసాలదేవి, రాష్ట్ర ఎస్‌సి సెల్ కన్వీనర్ నల్ల కదిరిగాళ్ల శాంతయ్య ఆధ్వర్యంలో గురువారం గడపగడపకు తిరిగి కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గోసాలదేవి మాట్లాడుతూ రాష్ట్ర పిసిసి అధ్యక్షులు గిడుగు రుద్రరాజు, ప్రధాన కార్యదర్శి జంగా గౌతం ఆదేశాల మేరకు నియోజకవర్గంలో ప్రతి గడపగడపకు తిరగడం మొదలు పెట్టానని ఎన్నికల సమయం ఒక సంవత్సరం ఉండగానే ప్రతి గడపలోను ప్రతి సమస్యను వినాలని వారికి తగిన న్యాయం చేయాలని తమ సంకల్పమని తెలిపారు. దేశంలో కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి జరుగుతుందని, రాహుల్ గాంధీ నాయకత్వాన్ని బలపరచాలని కోరారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

ప్రజాశక్తి-పుల్లంపేట

కరపత్రాలను అందిస్తున్న సుబ్రహ్మణ్యం

నియోజకవర్గ పరిధిలోని అయ్యవారిపల్లె, బొమ్మవరం తదితర గ్రామాలలో గురువారం మహాజన రాష్ట్ర వర్కింగ్ స్వతంత్ర అభ్యర్థి సుబ్రహ్మణ్యం విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాసమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు. 2024 సాధారణ ఎన్నికలలో మాకు అండగా నిలవాలని కోరారు. విద్య, వైద్య, పారిశ్రామిక రంగాల్లో అభివృద్ధి చేసి చూపిస్తామన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర యువజన అధ్యక్షులు మస్తానయ్య, పోలేపల్లి హేమంత్‌కుమార్, రైల్వే కోడూరు మండలఅధ్యక్షులు శంకరయ్య, రైల్వే కోడూరు మండల ప్రధాన కార్యదర్శి చిట్టిబాబు, నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి చంద్రమౌళి, పుల్లంపేట మండల ప్రధాన కార్యదర్శి రాగిపాటి పెంచలయ్య, పోలేపల్లి పెంచలయ్య, మహాజన రాష్ట్ర సమితి కార్యకర్తలు గ్రామ ప్రజలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

దళారులతో మోసపోతున్న మామిడి రైతులు

ప్రజాశక్తి-సుండుపల్లి

సంవత్సరం పొడవునా కష్టపడి మామిడి చెట్లను కాపాడు కుంటూ వస్తున్న రైతులకు వ్యాపారస్తులు, దళారుల చేతుల్లో మోస పోతూనే ఉన్నారు. అతివృష్టి, అనావృష్టి వలన ఈదురు గాలులు, వడగళ్ల వర్ష, అకాల వర్షంతో ప్రతి ఏడాది మామిడి రైతులకు కష్టాలు తప్పడం లేదు. ఈ ఏడాది వర్షాలు బాగా కురిసి మామిడి రైతులు ఆశించిన విధంగా ఫలితాలు రాకపోయినా అక్కడక్కడ మామిడి పంట బాగా ఉన్నా మండి వ్యాపారులు, దళారులు రైతులను నట్టేట ముంచుతున్నారని రైతులు వాపో తున్నారు. అధికారులు స్పందించి తమకు న్యాయం చేయాలని కోరుతున్నా పట్టించుకున్న పాపాలన పోవడం లేదు ప్రభుత్వ మాత్రం రైతులకు గిట్టు బాటు ధర కల్పించి రైతులను ఆదుకోవాలన్నారు. రాయవరం, కావలిపల్లికి చెందిన రామయ్య అనే రైతు దళారుల చేతుల్లో మోసపోయాయని చెప్పారు. రూ.1.30 లక్షలు మోసం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. తహశీల్దార్ మహబూబ్‌చాంద్, హార్టికల్చర్ వారితో మాట్లాడి చర్యలు తీసుకుంటామని అన్నారు. ప్రభుత్వం కనీస మద్దతు ధర కల్పించి రైతులను ఆదుకోవాలని కోరుతున్నారు.

రాయచోటి రోడ్డుకు మోక్షం ఎప్పుడో..!

ప్రజాశక్తి - వేంపల్లె

వేంపల్లె-రాయచోటి రోడ్డుకు మోక్షం ఎప్పుడు వస్తుందోనని పిసిసి మీడియా చైర్మన్ తులసిరెడ్డి అన్నారు. గురువారం వేంపల్లె-రాయచోటి రోడ్డు పనులను ఆయన కాంగ్రెస్ నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా తులసిరెడ్డి మాట్లాడుతూ జిల్లాలో వేంపల్లె-రాయచోటి రోడ్డు ప్రధాన మైందన్నారు. పాత రోడ్డు స్థానంలో కొత్త రోడ్డు మంజూరైందని తెలిపారు. కొత్త రోడ్డును వేయాలని పాత రోడ్డును తవ్వి రెండేళ్ల యిందన్నారు. ఈ రోడ్డు పూర్తికాకపోవడం వల్ల ప్రయాణికులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గంట ప్రయాణానికి రెండు గంటలు పడుతున్నట్లు తెలి పారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు రోడ్డు పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రయాణికుల ఇబ్బందులను తొలగించాలని ఆయన కోరారు.

నిలిచినపోయిన పనులను పరిశీలిస్తున్న తులసిరెడ్డి

విభిన్నప్రతిభావంతుల అభ్యున్నతికి కృషి

ప్రజాశక్తి - కడప అర్బన్

విభిన్నప్రతిభావంతుల విద్యార్థుల అభ్యున్నతికి ప్రభుత్వ అత్యధిక ప్రాధాన్యతనిస్తోందని జిల్లా ప్రాజెక్ట్ అధికారి డాక్టర్ అంబవరం ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. సమగ్ర శిక్ష ప్రాజెక్టు ద్వారా గురువారం విభిన్న ప్రతిభావంతుల విద్యార్థులకు బోధనోపకరణాలను పంపిణీ చేశారు. 18 మండలాల్లో ఉన్న 210 మందికి అందజేశారు. వేంపల్లి మండలంలోని భవిత పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు 17 మందికి రూ.2 లక్షల 28 వేలు విలువ గల బోధనోపకరణాలను, ఎంఆర్ కిట్లను పంపిణీ చేశారు. కో-ఆర్డినేటర్ మిట్ట కేశవరెడ్డి మాట్లాడుతూ వీరికి ఈ బోధనోపకరణాలు ఒక వరం లాంటివని తెలిపారు. వీటిని చక్కగా వినియోగించుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో సహాయ సమన్వయకర్త రమణమూర్తి, దశరథ రామిరెడ్డి, నెల్లూరు సిఆర్‌సి నుంచి ప్రవీణ్‌కుమార్, జగన్, ఐఇఆర్‌టి ఎస్.యశోద, మమత, సిద్దారెడ్డి, విజయమ్మ, రాంబాబు, విద్యార్థుల తల్లి దండ్రులు పాల్గొన్నారు.

ఫిర్యాదులను సంతృప్తికరంగా పరిష్కరించాలి

ప్రజాశక్తి-కడప

జిల్లాలో ప్రజల నుంచి అందే ఫిర్యాదులకు సంతృప్తి కరమైన పరిష్కారాన్ని అందించేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్ వి.విజయ్‌రామరాజు అధికారులను ఆదేశించారు. గురువారం అమరావతి నుంచి జగనన్నకు చెబుదాం, ఐసిడిఎస్ పరిధిలో ప్రభుత్వ పథకాలు, ఎస్‌డిజి ఇండికేటర్స్, స్కూల్‌ఎడ్యుకేషన్, గ్రామ,వార్డు సచివాలయాలు, స్పందన గ్రీవెన్స్, గడప గడపకు మన ప్రభుత్వం, తదితర అంశాలపై రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి డా.జవహం రెడ్డి సంబంధిత కార్యదర్శులతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లతో వర్చువల్ విధానంలో సమీక్షించారు. ఈ కార్యక్రమానికి స్థానిక కలెక్టరేట్ బోర్డు మీటింగ్ హాలు నుండి జిల్లా కలెక్టర్ వి.విజయ్ రామరాజు తోపాటు జాయింట్ కలెక్టర్ గణేష్ కుమార్,ట్రైనీ, అసిస్టెంట్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, డిఆర్ఒ గంగాధర గౌడ్, అన్ని శాఖల జిల్లా అధికారులు హాజరయ్యారు. సిఎస్ విసి ముగిసిన అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి సూచనలు, ఆదేశాల మేరకు ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాల ఫలాలు ప్రజలకు సంతృప్తి స్థాయిలో అందాలని, ప్రజల నుండి అందే స్పందన అర్జీలకు వేగవంతంగా, సంతృప్తి కరంగా పరిష్కారం చూపాలని ఆదేశించారు. స్పందన గ్రీవెన్స్‌తో పాటు 1902 టోల్‌ఫ్రీ నెంబర్ ఫిర్యాదుల జగనన్నకు చెబుదాం కార్యక్రమంపై ప్రజల్లో అవగాహన పెంచాలన్నారు. కార్యక్రమంలో డ్వామా, డిఆర్‌డిఎ, ల్యాండ్ సర్వే, హౌసింగ్, వ్యవసాయ అనుబంధ శాఖల జిల్లా అధికారులు, సంక్షేమ, సర్వే, ఇంజనీరింగ్ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాల పూర్తికి చర్యలు

పెద్దమొడియం : మండలంలో ఆగిపోయిన ఇళ్ల నిర్మాణాల పూర్తికి చర్యలు తీసుకుంటామని ఎఇ సుబ్బరాయుడు తెలిపారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో గురు వారం తహశీల్దార్ జ్యోతి రత్నకుమారి, ఎంపిడిఒ వెంకటరమణ ఆధ్వర్యంలో ఇళ్ల నిర్మాణాలపై సమీక్షిం చారు. ఈ సందర్భంగా ఎఇ సుబ్బ రాయుడు మాట్లా డుతూ మండలంలో 519 ఇళ్లు మంజూరు కాగా, అవి పలు దశల్లో ఉన్నాయని తెలిపారు. 320 ఇళ్లు పూర్తయ్యాయని తెలిపారు. మరికొన్ని వివిధ దశల్లో ఉన్నాయన్నారు. ఒక్క పెద్ద పసుపులలోనే అత్యధిక నిర్మాణాలు బేస్‌మెంట్ దశలో అగిపోయినట్లు తెలిపారు. వాటిని వెంటనే నిర్మాణం చేపట్టేలా మాట్లాడు తామన్నారు. సమావేశంలో ప్రత్యేకాధికారి వెంకటేశ్వర్లు, ఎఇలు, విఆర్ఒలు పాల్గొన్నారు.

గణితంలో పట్టు సాధించాలి

చాపాడు : స్థానిక చైతన్య భారతి ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాలలో గురువారం ఇంజనీరింగ్ మొదటి సంవత్సరం విద్యార్థులకు గణితంపై అవగాహన తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా చెన్నయ్‌కు చెందిన ఐఐటి డిపార్టుమెంటు ఆఫ్ మాథెమాటిక్స్ ప్రొఫెసర్ వై.వి.యస్.యస్. సన్యాసిరాజు మాట్లాడుతూ గణితంపై విద్యార్థులు పట్టు సాధించాలన్నారు. విద్యార్థులకు మాథెమాటిక్స్‌లో డిఫెరెంట్ ఈక్వేషన్స్, అప్లికేషన్స్ వివరించారు. ఏరోనాటికల్, వేవ్ ఈక్వేషన్స్, స్టీరింగ్ ఆఫ్ వైర్ అవసరం గురించి వివరిం చారు. స్థిరాంకాలు, ప్రమేయాలను తొలగించి పాక్షిక అవకలన సమీకర ణాల ను పరిష్కరించడం, రేఖా గణిత విధుల పరిష్కారాలను సాధించడం గురించి వివరించారు. తమ కళాశాల విద్యార్థులకు మ్యాథ్స్‌లో ఎన్నో అమూల్యమైన విషయాలను తెలియజేయడం పట్ల కళాశాల కరెస్పాండెంట్ డాక్టర్ వి.జయచంద్రారెడ్డి, కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జి.శ్రీనివాసులరెడ్డి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం సన్యాసిరాజును ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

గురుకుల పాఠశాలల్లో ఖాళీ పోస్టుల భర్తీ

ప్రజాశక్తి-జమ్మలమడుగు రూరల్

జిల్లాలోని జమ్మలమడుగు (బాలురు), కమలాపురం (బాలురు), వనిపెంట (బాలికలు), వేంపల్లి (బాలికలు) మహాత్మ జ్యోతిబాపూలే బిసి గురుకుల పాఠశాలల్లో 6,7,8,9 తరగతుల్లో ఆంగ్ల మాధ్యమంలో వివిధ కేటగిరీలోని ఖాళీలను భర్తీ చేయడానికి ఆయా పాఠశాలల్లో దరఖాస్తులు అందుబాటులో ఉన్నాయని కన్వీనర్, ప్రిన్సిపల్ కె.వి.ఎస్.రామకృష్ణారెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగల విద్యార్థులు ఆయా పాఠశాలల నుండి రెండు ఫోటోలతో ఈనెల 2 నుండి 8వ తేదీ వరకు దరఖాస్తులు సమర్పించవచ్చన్నారు. దరఖాస్తులు సమర్పించిన విద్యార్థులకు వనిపెంట గురుకుల పాఠశాలలో ఈనెల 11న ఉదయం 11 గంటల నుండి మధ్యాహ్నం 12.30 గంటల వరకు ప్రవేశ పరీక్ష నిర్వహిస్తామన్నారు. ఆయా కేటగిరీలో ఖాళీగా ఉన్న సీట్లు తెలుసుకునుటకు సమీపంలోని మహాత్మ జ్యోతిబాపూలే బిసి గురుకుల పాఠశాలను సంప్రదించగలరన్నారు. వివరాలకు 90104 40416ను సంప్రదించగలరన్నారు.

తాగునీటి బోరుకు కొత్త మోటర్ ఏర్పాటు చేయిస్తున్న సర్పంచ్ రెడ్డి రామ్

గ్రామాభివృద్ధే ధ్యేయం

ప్రజాశక్తి-కలికిరి

గ్రామాభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తానని మర్రికుంటపల్లి సర్పంచ్ రెడ్డిరామ్ తెలిపారు. మర్రికుంటపల్లి పంచాయతీ బోడిరెడ్డిగారిపల్లెలో గత కొన్ని రోజులుగా గ్రామస్తులు తాగునీటికి ఇబ్బందులు పడుతుంటే వెంటనే స్పందించిన సర్పంచ్ రెడ్డిరామ్ కొత్త మోటర్‌ను ఏర్పాటు చేసి తాగునీటి సమస్యను పరిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో ఎలాంటి సమస్యలున్నా వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని ముఖ్యంగా తాగునీటి సమస్య, పారిశుద్ధ్యం పై ప్రత్యేక దృష్టి సాధించి సెక్రటరీ తిమ్మారెడ్డి సహకారంతో గ్రామాన్ని అభివృద్ధి పథంలో తీసుకపోవడానికి ప్రజలందరూ సహకరించాలని కోరారు.

పాల ప్యాకెట్లు పంపిణీ చేస్తున్న సర్పంచ్ నాగార్జున చారి

ప్రతి ఒక్కరూ పాలను విధిగా తీసుకోవాలి

పజాశక్తి-వీరబల్లి

చిన్న పిల్లలు మొదలుకొని వృద్ధుల వరకు పాలను విధిగా తీసుకోవాలని మట్లి సర్పంచ్ నాగార్జునాచారి తెలిపారు. గురువారం అయన మట్లి లోని బోడిమాల్లారెడ్డిగారిపల్లిలో పశువైద్యడు జయప్రకాశ్ ఏర్పాటు చేసిన ప్రపంచ పాల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ పాలలో కాల్షియం, విటమిన్‌ఎ, విటమిన్ ఇ అధికంగా ఉంటా యాని తెలిపారు. చిన్న పిల్లలు మొదలుకొని వృద్ధుల వరకు ప్రతి రోజు తాగడం ఆరోగ్యకరమని అన్నారు. అనంతరం సచివాలయ కంపెనీ వారు సరఫరా చేసిన మినరల్ మిక్సర్, లివర్ టానిక్ లను సుమారు 30 మంది పాడి రైతులకు, పంపిణీ చేశారు. కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది, పాడి రైతులు పాల్గొన్నారు.

విద్యార్థులకు సర్టిఫికేట్లు అందిస్తున్న ప్రిన్సిపల్ యువరాజ్

జాతీయ స్థాయిలో 'మిట్స్' విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-కురబలకోట

స్థానిక మిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ విభాగములో మూడవ సంవత్సరము బి.టెక్ చదువుతున్న నితీష్, పునీత్‌లు అంతర్జాతీయ స్థాయి లో ప్రతిభ కనపరిచినట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సి.యువరాజ్ తెలిపారు. ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ ఆన్ డేటా సైన్స్ అండ్ ఆర్టిఫిషల్ ఇంటెలిజెన్స్-2023 సదస్సులో ఈ విద్యార్థులు వివరించిన పరిశోధన జర్నల్‌కు అంతర్జాతీయ స్థాయిలో బెస్ట్ స్టూడెంట్ పేపర్ అవార్డును ఈ విద్యార్థులు అందుకున్నట్లు ఆయన అన్నారు. ప్రతిభ కనపరిచిన విద్యార్థులను కళాశాల కరెస్పాండంట్ డాక్టర్ ఎన్.విజయ భాస్కర్ చౌదరి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కీర్తినాదెళ్ల, ప్రిన్సిపల్ డాక్టర్ సి.యువరాజ్, విభాగాధిపతి డాక్టర్ కల్పన అధ్యాపకులు, విద్యార్థులు అభినందనలు తెలిపారు.

క్రైం కార్నర్

వివరాలు వెల్లడిస్తున్న రూరల్ సిఐ పుల్లయ్య

భార్య హత్య కేసులో భర్త అరెస్టు

ప్రజాశక్తి-రాజంపేట రూరల్

ఈనెల 30న మండల పరిధిలోని సీతారాంపురం దళితవాడలో అనుమానంతో భార్యను చంపి పరారైన నిందితుడు గంగయ్యను గురువారం రూరల్ పోలీసులు చిట్వేలు రహదారిలోని పోలి క్రాస్ రోడ్డు వద్ద అరెస్టు చేసి అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రూరల్ సిఐ పుల్లయ్య మాట్లాడుతూ సుమారు 22 సంవత్సరాల క్రితం మృతురాలు వరమ్మ(38)తో గంగయ్యకు వివాహమైందని, భార్యకు అక్రమ సంబంధం ఉందన్న అనుమానంతో గత మూడు నెలల నుంచి తరచుగా గొడవపడే వారని తెలిపారు. ఈ నేపథ్యంలో 30వ తేదీ రాత్రి మద్యం తాగి నిద్రిస్తున్న వరమ్మను వ్యవసాయ పనిముట్లు పారతో తల పైన బాది హత్య చేసి సమీప పొలాల్లోకి పారిపోయాడని వివరించారు. మృతురాలి తల్లి లక్ష్మీదేవి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టామని భాగంగా రాబడిన సమాచారం మేరకు గురువారం నిందితుడిని అరెస్టు చేయడం జరిగిందని తెలిపారు. హత్యకు వినియోగించిన పార, రక్తపు మరకలు కలిగిన నిందితుడి దుస్తులు స్వాధీనం చేసుకోవడం జరిగిందని తెలిపారు. ముద్దాయిని కోర్టుకు హాజరు పరచనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో రూరల్ ఎస్ఐ భక్తవత్సలం, సిబ్బంది పాల్గొన్నారు.

వ్యక్తిపై హత్యాయత్నం

ప్రజాశక్తి-పెద్దమండ్యం

మండలంలోని పాపేపల్లి పంచాయతీ వెలిగింటివారిపల్లి దళితవాడలో బుధవారం అర్ధరాత్రి ఆగ్రామనికి చెందినవ్యక్తిపై హత్యాయత్నం జరిగింది. స్థానికులు కథనం మేరకు వివరాలిలావున్నాయి. వెలిగింటివారిపల్లి చెందిన బాలపోగు తిమ్మయ్య కుమారుడు రామకృష్ణ బతుకుదెరువు కోసం బెంగళూరుకు కూలీకి వెళ్లాడు. పింఛను కోసం బుధవారం బెంగళూరు నుంచి తన స్వగ్రామానికి వచ్చి రాత్రి సమయంలో తన ఇంటి ముందర మంచంపై పడ్డుకొని ఉండగా గుర్తు తెలియని వ్యక్తులు వీధి దీపాలను అపివేసి రామకృష్ణ మెడపైన కత్తితో దాడిచేసి హత్యాయత్నానికి పాల్పడ్డారు. గాయపడిన రామకృష్ణ కేకలు వేయడంతో వెంటనే గాయపడిన రామకృష్ణను 108 వాహనంలో మదనపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ వైద్యులు పరిశీలించి మెరుగైన వైద్యసేవలు కోసం బెంగళూరుకు తరలించారు. సమాచారం తెలుసుకున్న డిఎస్‌పి కేశప్ప డాగ్ స్క్వాడ్, క్లూస్‌టీమ్‌తో వేలిముద్ర నిపుణులతో సంఘటన స్థలాన్ని క్షుణంగా పరిశీలించారు. కార్యక్రమంలో సిఐ శివంజనేయులు, ఇన్‌చార్జి ఎస్ఐ మధు రామచంద్రుడు, పోలీసులు సిబ్బంది పాల్గొన్నారు.